ప్రజాశక్తి

మంగళవారం 27 జూన్ 2023

5

పార్వతీపురం మన్యం



అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి


ప్రజాశక్తి - సీతంపేట



మండలంలోని పెద్దపొల్ల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వాన ఉమామహేశ్వరరావు (35) పచ్చకామెర్లతో సోమవారం మృతి చెందారు. వీరఘట్టం మండలం రాజపురం గ్రామానికి చెందిన ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న డిడి శ్రీనివాసరావు ఉపాధ్యాయుడి అంత్యక్రియలకు ఆ శాఖ నుండి రూ.25వేలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం.భాస్కరరావు, ఎటిడబ్ల్యూఒ మంగవేణి సంతాపం తెలిపారు.

అమ్మఒడి.. అలజడి

అమ్మఒడి పథకంపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో అలజడి నెలకొంది. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28న విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనుంది. తొలి ఏడాది రూ. 15వేలు, తరువాత రూ.14వేలు చెల్లించిన విషయం విధితమే. గత ఏడాది మరో రూ.1000 తగ్గించి రూ.13వేలు జమ చేసింది. ఈ ఏడాది ఎంత జమ చేయన ఉన్నారో తెలియాల్సి ఉంది. ప్రతి విద్యార్థికీ అమ్మఒడి అందజేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటికి ఒక విద్యార్థి అని పరిమితం చేశారు. ఆ తర్వాత క్రమ క్రమంగా నిబంధనలు అమలు చేస్తూ అర్హులను అనర్హులుగా ప్రకటించి ఈ పథకానికి దూరం చేస్తున్నారు. హాజరు శాతంతో పాటు ఆంక్షల మధ్య అమ్మఒడి ఎందరికి వస్తుందో, ఎవరికి రాదో సందేహాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం జాబితా రూపొందించారు. ఏటా కోత పెడుతుండడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.



- 28న ఖాతాల్లో నగదు జమ
- అర్హుల జాబితాపై ఉత్కంఠ
- ఏటా విద్యార్థుల జాబితాలో కోత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో 2019-20లో 1,73,420 మంది విద్యార్థులకు రూ.260.19 కోట్లు అమ్మఒడి పథకం ద్వారా అందజేశారు. 2020-21 లో 1,63,148 మందికి రూ.244.71 కోట్లు, 2021-22 లో 1,73,440 మందికి రూ.260.16 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 83733 మంది విద్యార్థులకు రూ 125.59 కోట్లు అందచేయనున్నారు. ఈనెల 28న కురుపాంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో నగదును జమ చేయనున్నారు. విద్యా సంవత్సరంలో హాజరు నమోదు, బ్యాంకు అకౌంట్ అనుసంధానం వంటి అంశాలను తప్పనిసరి చేశారు. గతంలో బ్యాంకు ఐఎఫ్ఎస్‌సి కోడ్ మేరకు డబ్బును జమ చేసేవారు. గతేడాది నుంచి పిసిఐకి కనెక్ట్ చేస్తేనే నగదు జమ అవుతుంది. తల్లి దండ్రులకు ఎక్కువగా జీరో అకౌంట్, డ్వాక్రా, ఇతరత్రా అకౌంట్లు ఉన్నాయి. ఎక్కువ మంది మహిళలకు రెండు అకౌంట్లు ఉండడంతో దేనికి ఆధార్, మొబైల్ నెంబర్ అనుసంధానంలో ఉందన్న విషయం తెలియలేదు. ఏ అకౌంట్‌కు ఎసిపిఐకి కనెక్టివిటీ ఉందో తెలియక బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసారు. జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు తల్లి దండ్రులు సచివాలయాలను సంప్ర దిస్తున్నారు.

8 అంశాలతో లబ్ధిదారుల ఎంపిక

అమ్మఒడి అర్హతకు ప్రభుత్వం విధించిన ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశంతో పాటు మరో 8 గ్రీవెన్స్ అంశాలు పరిశీలించనున్నారు. 75 శాతం హాజరు, 300 యూనిట్ల లోపు కరెంట్ బిల్లు, కారు లేదా జీపు, పొలం పరిమితి, గ్రామీణ ప్రజల కుటుంబ ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు, మున్సిపాలిటీ పరిధిలో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థలం ఉండకూడదనే నిబంధనలు ఉన్నాయి. విద్యార్థి, తల్లి ఆధార్, జగనన్న విద్యాదీవెన పొందుతున్నారా, మ్యాపింగ్ నమోదు అయిందా లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.

లబ్ధిదారులు బ్యాంకు అకౌంట్లు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు లింకప్ ఉండాలన్న నియమం కూడా ఇబ్బందులకు గురి చేస్తోంది. అమ్మఒడి లబ్ధిదారుల జాబితా తయారీపై ఎప్పటికప్పుడు కసరత్తు తప్పడం లేదు. గతంలో పాఠశాలకు లాగిన్ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ల లాగిన్లకు తల్లిదండ్రులను పంపించి విద్యార్థుల సమాచారాన్ని సరిచేయిస్తోంది.

అర్హులందరికీ అమ్మఒడి



జిల్లాలో అమ్మఒడి అర్హుల జాబితా పరిశీలన ప్రక్రియ పూర్తి అయ్యింది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఈ పరిశీలన సాగింది. విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో విద్యార్థులు పాఠశాలలు మారినప్పటికీ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రతి విద్యార్థికి ఐడి ఉంటుంది. అర్హులందరికీ అమ్మబడి అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- ఎన్.ప్రేమ్‌కుమార్, డిఇఒ పార్వతీపురం



విన‌తులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

వినతులకు సంతృప్తికర పరిష్కారం : పిఒ

ప్రజాశక్తి - కలెక్టరేట్

జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో ప్రజలు అందజేసిన వినతులకు సంతృప్తికర పరిష్కారం, సకాలంలో చూపించాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకటరావుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదులను సంబంధిత అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై 76 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో అన్నిశాఖ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సభా వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కళావతి, అధికారులు

సిఎం సభకు పక్కాగా ఏర్పాట్లు

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 28న కురుపాంలో పర్యటిస్తున్న సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సభ జరగనున్న స్థలాన్ని, ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇదే వేదిక నుంచి అమ్మఒడి నాలుగో విడత నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారన్నారు. సభా స్థలం, రూట్ మ్యాప్, హెలీప్యాడ్ తదితర ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభా స్థలానికి ప్రజలు వచ్చేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలిపారు. పోలీసు బందోబస్తు, ప్రజలకు మంచినీరు, రవాణా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి హోదాలో మొట్టమొదటిసారిగా జగన్ మోహన్ రెడ్డి జిల్లాకు వస్తుండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని, కావున ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, వాహనాల పార్కింగ్ లాంటి ఏర్పాట్లు చేయడంలో అశ్రద్ధ వహించవద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎఎస్‌పి ఎస్పీ ఓ.దిలీప్ కుమార్, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

సిఎం సభా ఏర్పాట్లు పరిశీలన

అమ్మ ఒడి కార్యక్రమంలో పాల్గొనడానికి ఈనెల 28న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కురుపాం వస్తున్న నేపథ్యంలో సోమవారం వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి, వైసిపి ఉత్తరాంధ్రా యూత్ జోనల్ వింగ్ ఇంఛార్జి అవనాపు విక్రమ్ సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈసభా వేదికకు వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను, ఏర్పాట్లను చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు మండల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

హెలీప్యాడ్ పరిశీలన

జియమ్మవలస : ముఖ్యమంత్రి కురుపాంకు వస్తుండడంతో మండలంలోని చిన్నమేరంగిలో గల పాలిటెక్నికల్ కళాశాల వద్ద హెలీ ప్యాడ్‌ను అధికారులు సిద్ధం చేశారు. సభాస్థలికి దగ్గరగా ఉండడంతో భద్రతా కారణాల దృష్ట్యా పాలిటెక్నికల్ కళాశాల వద్ద హెలికాప్టర్ దిగేందుకు అధికారులు సన్నద్ధం చేశారు. పాలిటెక్నికల్ కళాశాల వద్ద హెలీప్యాడ్ నిర్మాణానికి అనుకూలంగా ఉండడంతో అధికారులు ఆ స్థలాన్ని ఎంచుకున్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్, పోలీస్ అధికారులు సోమవారం వచ్చి క్షుణంగా పరిశీలించారు. హెలీప్యాడ్‌తో పాటు ముఖ్యమంత్రి వెళ్లే రహదారిని కూడా పరిశీలించారు. పాలిటెక్నికల్ కళాశాల నుంచి సభాస్థలికి 1.5 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఈ రహదారిలో ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం బారికేడ్లను కూడా రహదారి పొడవునా అధికారులు వేస్తున్నారు. జిల్లా భద్రత సిబ్బంది సోమవారం జామర్లతో హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి భద్రత సిబ్బంది కూడా మంగళవారం వచ్చి మరోసారి హెలీప్యాడ్ వద్ద పరిశీలిస్తుంది.

యువ న్యాయవాదులకు ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - కలెక్టరేట్

వైఎస్ఆర్ లా నేస్తం నాలుగో విడత నిధులు పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ప్రారంభించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జె.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన 12 మంది న్యాయవాదులకు, ఈ పథకం ద్వారా రూ.2లక్షల 40వేలు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నగదు వారికి ఆర్థిక భరోసాను కల్పిస్తుందని, పుస్తకాలు, రవాణా, ఇతర అవసరాలకు ఎవరిపైనా ఆధారపడకుండా మూడేళ్ల వారి ప్రాక్టీస్‌ను అభివృద్ధి చేసుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ పథకానికి అర్హులైన ప్రతి యువ న్యాయవాది సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సచివాలయ కోఆర్డినేటర్ చిట్టిబాబు, న్యాయవాదులు జి.శరత్ చైతన్య, కె.శ్రీధర్, జి.రాజ్‌కుమార్, పి.లావణ్య, టి.మౌనిక, శిరీష తదితరులు పాల్గొన్నారు



న్యాయవాదులకు చెక్‌ను అందజేస్తున్న డిఆర్ఒ వెంకటరావు

రూ.2 వేల నోట్ల మార్పిడి పేరుతో ఘరానా మోసం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

2వేల రూపాయలు నోట్ల మారకం పేరుతో పార్వతీపురం వేదికగా రూ.90 లక్షల రూపాయల ఘరానా మోసం జరిగినట్లు సోమవారం రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా రేగిడి మండలానికి చెందిన ఆబోతుల అనిల్ కుమార్, వేంపల్లి అనిల్ కుమార్ ప్రయివేట్ బ్యాంకు ఉద్యోగులు. వీరు కొంతమంది అపరిచిత వ్యక్తులతో రూ.90 లక్షలకు 500 నోట్లు ఇస్తే రూ.2వేల నోట్లు కోటి రూపాయలకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే బాధితుల దగ్గర నుండి డబ్బులు తీసుకున్న తర్వాత వారు ఇదిగో ఇక్కడ ఇస్తామంటూ మాయమాటలు చెప్పసాగారు. పరిస్థితి గ్రహించిన బాధితులు వీరిని నిలదీయగా, పార్వతీపురం మండలం నర్సిపురం సమీపాన గల టిబిఆర్ సినిమా థియేటర్ దగ్గర సోమవారం ఇస్తామని నమ్మబలికారు. ఈ విషయంపై ఎందుకైనా మంచిదని ఆబోతుల అనిల్ కుమార్ పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి వారి సహకారంతో సినిమా థియేటర్ దగ్గర మాటు వేశారు. భీమవరానికి చెందిన ఎస్‌కె అజీమ్,, కాకినాడకు చెందిన చక్రపాణి అనే వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.49 లక్షల 13 వేలు స్వాధీనం చేసున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులు మరో ఇద్దరు ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు.



ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని...

మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన

ప్రజాశక్తి - సీతంపేట

దీర్ఘకాల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెలా 5లోగా వేతనాలు చెల్లించాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు 20 రూపాయలకు పెంచాలని, పథకానికి బడ్జెట్ పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాజకీయ వేధింపులు ఆపాలని, మంచినీరు, వంటషెడ్, పాత్రలు ప్రభుత్వమే ఇవ్వాలని, ఏడాదికి రెండు జతల యూనిఫాం అందజేయాలని కోరారు. జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటెంతో ప్రభుత్వం మెనూ తయారు చేసి వర్కర్లపై భారాన్ని మోపుతోందన్నారు. ఒకవైపున పని భారం, మరోవైపున ధరల భారంతో పెరగని వేతనాలు, మెనూ ఛార్జీలతో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహణ కష్టంగా మారిందన్నారు. మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికసంఘం నాయకులు ఎన్.రోయిబాయి, కె.ఉష, వసంతకుమారి, కె.పద్మ, మీనా, ఎస్.మల్లిక, సిఐటియు నాయకులు ఎం.కాంతారావు, ఎస్.సురేష్, కె.రాము పాల్గొన్నారు.

ఏజెన్సీలో పడకేసిన పారిశ్రామిక ప్రగతి

- మూతపడ్డ చిన్న తరహా పరిశ్రమలు
- వలసబాట పట్టిన గిరిజన యువత
- ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించేనా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలోని చిన్న తరహా పరిశ్రమలు మూతపడడంతో గిరిజనులకు ఉపాధి కరువైంది. గతంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో పట్టు పరిశ్రమ, చేపల ఉత్పత్తి కేంద్రం, బనియన్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేసి కొన్నేళ్లపాటు ఉపాధి కల్పించారు. అయితే వీటిని ప్రారంభించిన ఐటిడిఎ అధికారులు బదిలీలపై వెళ్లడం, ఆ తర్వాత వచ్చిన అధికారులు వీటిపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో 10, 15ఏళ్లకే మూతపడ్డాయి. దీంతో గిరిజనులకు ఉపాధి కరువైంది. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి దూరప్రాంతాలకు వలస బాట పట్టాల్సి వస్తుంది.

మండలంలోని డుమ్మంగి సమీపంలో చేపల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ జూన్ నుంచి డిసెంబర్ వరకు ఉత్పత్తి చేసిన చేప పిల్లలను వివిధ ప్రాంతాల్లో ఉన్న సొసైటీలకు పంపిణీ చేసేవారు. తద్వారా ప్రభుత్వానికి, గిరిజనులకు ఆదాయం వచ్చేది. కొన్నేళ్ల పాటు చేపల ఉత్పత్తి కేంద్రం నిర్వహణ కొనసాగిన తర్వాత వచ్చిన అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగమైంది. ఇక్కడ విధులు నిర్వహించిన ఫిషర్ మాన్, ఇద్దరు అసిస్టెంట్ ఫిషర్ మ్యాన్, వాచ్ మెన్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆ స్థానంలో ఎవర్నీ నియమించలేదు. చేపల పిల్లల ఉత్పత్తికి నిర్మించిన కుండీలు నిరుపయోగం అయ్యాయి. సిబ్బంది వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయి. అలాగే కురుపాం మండలం పి.లేవిడి లో కొన్నాళ్లు పాటు పట్టు పరిశ్రమ నిర్వహణతో గిరిజనులకు ఉపాధి దొరికేది. ఇక్కడ పట్టుపురుగులను పెంచి వాటి ద్వారా పట్టు సేకరించేవారు. ఇక్కడ ఉన్న పట్టు పరిశ్రమను విజయనగరం పట్టు పరిశ్రమలో విలీనం చేశారు. ఉద్యోగులను అక్కడకు బదిలీ చేశారు. దీంతో గిరిజనులకు ఉపాధి కరువైంది. గుమ్మలక్ష్మీపురం ఆర్ఐటిఐ అదనపు భవనంలో ఫ్యాషన్ టెక్నాలజీ మూడేళ్ల పాటు నిర్వహించారు. నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చి బెంగళూరు, చెన్నై వంటి దూర ప్రాంతాల్లో ఉపాధి కల్పించారు. అప్పటి ఐటిడిఎ పిఒ సువర్ణపండా దాస్ బదిలీపై వెళ్లడంతో ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణా కేంద్రం మూత పడింది. దీంతో గిరిజనులకు స్వయం ఉపాధి కరువైంది.

జీడి ప్రాసెసింగ్ యూనిట్లు వదిలేశారు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో వేలాది ఎకరాల్లో జీడిపంట గిరిజనులకు ఆదాయ వనరుగా ఉంది. ప్రతి ఏటా పదివేల టన్నులకు పైగా జీడి దిగుబడి వస్తుంది. జెకె పాడు, దుర్బిలి గ్రామాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు గతంలో ఐటిడిఎ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం యంత్ర సామాగ్రి కూడా కొనుగోలు చేశారు. అయితే నేటి వరకు ప్రారంభించకుండా వదిలేశారు. జీడిపిక్క తొక్క తీయడంపై పలువురు గిరిజన రైతులకు శిక్షణ కూడా ఇచ్చారు. ఉపాధి కల్పించడం మాత్రం మరిచారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏజెన్సీలో పారిశ్రామిక ప్రగతికి కృషి చేసి, నిరుద్యోగ గిరిజన యువతను ఆదుకోవాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు, నిరుద్యోగ యువత కోరుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని చేపల ఉత్పత్తి కేంద్రం

చిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలి

గతంలో మాదిరిగా గుమ్మ లక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీ మండలాల్లో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి. స్థానికంగా ఉపాధి పొందడంతో వలసలు నివారణ అరికట్టవచ్చు. ఆ దిశగా ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు దష్టి సారించాలి.

మండంగి రమణ,
గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు,
ఎంపిటిసి చెముడుగూడ

జీడి ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలి

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్లను ఐటిడిఎ అధికారులు నెలకొల్పి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. ప్రతి ఏటా జిసిసి ద్వారా జీడి పంటను కొనుగోలు చేసి దళారుల బెడద నుంచి రక్షించాలి. జీడిపిక్క కొనుగోలు ధర కేజీ రూ.200 పెంచాలి. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి

కోలక అవినాష్
ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

చేపల కేంద్రం అభివృద్ధి చేయాలి

డుమ్మంగి చేపల ఉత్పత్తి కేంద్రం వినియోగంలోకి తీసుకువచ్చి గిరిజనులకు ఉపాధి కల్పించాలి. ముఖ్యంగా గిరిజన నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకుని వైటిసిలో శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలి.

పాలక క్రాంతి కుమార్
సర్పంచి డుమ్మంగి

సింగిల్ మేజర్ సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో విద్యార్థులు, విద్యారంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం డిఆర్ఒ జె.వెంకటరావుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ వినతిని అందజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం, కె.భాస్కర్ మాట్లాడుతూ డిగ్రీలో సింగిల్ సబ్జెక్టు మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేయడం వల్ల గ్రూపులుగా విడిపోవడమే కాకుండా విద్యార్థుల నిష్పత్తి శాతం తగ్గిపోతుందని అన్నారు. దీని వల్ల భవిష్యతులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మూసుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. త్రీ సబ్జెక్టు విధానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, ఎస్సీ, బీసీ పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్టీ పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు అదనపు భవనాలు నిర్మించాలని, ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్ సీట్ల సంఖ్య 80కి పెంచాలని, మెస్ చార్జీలు పెంచాలని, సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు.

సిఎం దృష్టికి గిరిజన సమస్యలు

ప్రజాశక్తి - కురుపాం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కురుపాంలో ఈనెల 28న పర్యటన నేపథ్యంలో గిరిజన ప్రాంతంలో గిరిజనుల సమస్యలు గిరిజన ప్రజా ప్రతినిధులు సిఎం దృష్టికి తీసుకువెళ్లాలని గిరిజన అభ్యుదయ సంఘ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ బోయ వాల్మీకి, బెంతుఒరియాలను షెడ్యూల్ జాబితాలో చేర్చే తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని, జీవో 3ను పునరుద్దించి, ఐటిడిఎ పరిధిలో ఉన్న 8 మండలాలు, 216 పంచాయతీలు, 1496 గ్రామాలు అన్నింటికీ షెడ్యూల్ ఏరియా సర్టిఫికెట్స్ మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాలకు పక్కా రోడ్లు మంజూరు చేయాలని, తాగునీరు, విద్య ,వైద్య ఆరోగ్య సమస్యలపై దృష్టిసారించాలని కోరారు. పూర్ణపాడు లాభేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, ఆశ్రమం పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని, తదితర ప్రధాన సమస్యలపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు.

28 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని డోకిశీలలో 28 మంది చిన్నారులకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి నిహారిక తెలిపారు. సోమవారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థుల పౌష్టికాహారలోపంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేశారు.

అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కృష్ణపల్లిలో సోమవారం పర్యటించిన ఆయన జగనన్న కాలనీ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందకుండా మిగిలిన వారిని గుర్తించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది అంతా ఈ కార్యక్రమంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండి, విజయవంతం చేయాలని కోరారు

జంఝావతి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కురుపాం రాక సందర్భంగా ఈ జిల్లాలో ప్రధాన సాగునీటి వనరైన జంఝావతి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు పూర్తికి ఒడిశా ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వారాడ శ్రావణ్ కుమార్, బుడితి అప్పలనాయుడు కోరారు. అలాగే పాలకొండ నియోజకవర్గం పరిధిలో ఉన్న జంపర కోట రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తే గిరిజన రైతులకు చెందిన 2100 ఎకరాలకు ఉపయోగ పడుతుందని, లచ్చయ్య పేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి ఈ ప్రాంత రైతు, కార్మికులకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక చికిత్సకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

డెంగీ జ్వరాలకు స్థానిక జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స అందించేలా చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టర్‌లో డిఆర్ఒ జె.వెంకటరావును కలిసి వినతి పత్రాన్ని అందించారు. ప్రస్తుత రోగాల సీజన్‌కు సంబంధించి జిల్లా ప్రజల ఆరోగ్య పరిస్థితులపై చర్చించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ పచ్చకామెర్లు తదితర రోగాలకు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రోగులను రిఫర్ చేయకుండా స్థానిక జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వంగల దాలి నాయుడు, బంటు శిరీష్, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, రౌతు బాలాజీ నాయుడు, సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. దీనిపై స్పందించిన డిఆర్వో సంబంధిత శాఖ అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఆదేశించారు..

30న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతి విద్యార్థుల సీట్లు కోసం ప్రవేశాలకు ప్రవేశాల పరీక్ష ఈనెల 30న జరుగుతుందని ప్రిన్సిపల్ కె.ఈశ్వరరావు సోమవారం తన పర్యటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే వారు ఈనెల 28లోగా కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు.

జగనన్న ఆణిముత్యం నగదు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కింద నగదు పంపిణీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు మరింత బాగా చదవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ.ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎపిజివిబి మేనేజర్ వివిఆర్ రెడ్డి అన్నారు. ఈ బ్యాంక్ శాఖ పరిధిలోని కొంకడివరంలో బ్యాంకుమిత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాసుబుక్కు ప్రింటర్‌ను సోమవారం జిల్లా మేనేజర్ వెంకటరమణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు సేవలను మరింత సులభతరం చేసేందుకు, కొంకడివరంలోని ఖాతాదారుల సౌలభ్యం కోసం సిఎస్‌పి వద్ద పాసుబుక్ ప్రింటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ సిఎస్పీల వద్ద ఏర్పాటు చేసిన ప్రింటర్ ద్వారా పాసుబుక్‌లను అప్డేట్ చేసుకోవచ్చున్నారు. ఇకపై బ్యాంకులకు వెళ్లి పాసుబుక్కులను అప్డేట్ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సి ఎస్ పి టి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సిపిఐ లేఖ

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 28న కురుపాంలో పర్యటించనున్న సందర్భంగా జిల్లాలోని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మధరావు లేఖ రాశారు. ప్రధానంగా జిల్లాలో ఏనుగులను తరలించాలని, జీడిపిక్కల, పసుపు, ఫైనాపిల్ ప్రాసెసింగ యూనిట్లు ఏర్పాటు చేయాలని, తోటపల్లి ఎడమ, కుడి కాలువ పనులు మరమ్మరం చేయాలి, జంఝావతి ప్రాజెక్టు పూర్తికి చర్యలతో పాటు మరిన్ని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లేఖ రాశారు.

పోయిన బ్యాగ్ అందజేత

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆటోలో మరిచి పోయిన బ్యాగ్‌ను పోలీసులు మహిళకు అందజేశారు. సోమవారం గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 23న నెల్లిమర్లలో ఆటోలో ప్రయాణిస్తూ తన వెంట తెచ్చుకున్న బ్యాగును ఆటోలో మరిచిపోయి నెల్లిమర్లలో దిగిపోయింది. అయితే మహిళ బ్యాగులో వాళ్ళ అమ్మాయి తాలూక సర్టిఫికెట్లు, విలువైన సామాన్లు ఉన్నాయని 24న ఎస్ఐ పి.నారాయణ రావుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ నారాయణరావు వెంటనే స్పందించి తన సిబ్బందితో కలిసి బ్యాగును వెతికి పట్టుకొని మహిళకు అప్పగించారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి-వేపాడ

విజన్ కలిగిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ లభిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ యువ నేత గొంప కృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని వల్లంపూడి గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్ అధ్యక్షతన టిడిపితో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందన్నారు. రానున్న కాలంలో చంద్రబాబునాయుడును సిఎంను చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు అండగా నిలవండి

ప్రజాశక్తి - సీతానగరం

పోలవరం నిర్వాసితులకు సంఘీభావం ప్రకటించి విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. పోలవరం నిర్వాసితులకు సంఘీభావం తెలుపుతూ హనుమాన్ జంక్షన్ నుంచి మార్కెట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రను ఉద్దేశించి రెడ్డి వేణు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్ట ప్రకారం పునరావాసం కల్పించి నష్టపరిహారం ఇవ్వాలి, 1986, 2022 వరదల్లో మునిగిన గ్రామాలన్నింటినీ మొదటి దశ పునరావాసంలో కలపాలని కోరారు. గోదావరి వరదల నుంచి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, గత ఏడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, తప్పులు తడకగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రెడ్డి లక్ష్మీనాయుడు, బొరపరెడ్డి అప్పారావు, ఆర్.రమణమూర్తి, వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : పోలవరం నిర్వాసితుల పాదయాత్రకు బలిజిపేటలో సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సంఘీభావంగా సోమవారం రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ నిధి సేకరించడానికి సిపిఎం పూనుకుందన్నారు. ఇందులో భాగంగా విరాళాలు మండలంలో సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆవు సాంబమూర్తి, నల్ల ఈశ్వరరావు, బొద్దాన భాను, గంట్యాడ బలరాం నాయుడు, పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన పలుచోట్ల విరాళాల సేకరణ



సీతానగరం: విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

సాలూరు : పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్రకు సంఘీభావంగా ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు విరాళాలు ఇచ్చి సహకరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు కోరారు. పట్టణంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బి.శశికళ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు ఆధ్వర్యాన రెండు బృందాలు పోరుకేక మహాపాదయాత్రకు సంఘీభావంగా విరాళాలు సేకరించారు.

పార్వతీపురం రూరల్: పోలవరం పోరుకేక పాదయాత్రకు సంఘీభావం ప్రకటిస్తూ, పాదయాత్రకు ఆర్థికంగా సహకారం కోరుతూ మండలంలోని కోటవాని వలస, బంటువాని వలస, నవిరి నిర్వాసితుల కాలనీల్లో సిపిఎం నాయకులు బంటు దాసు, గొర్లి వెంకటరమణ, నాయకులు నిధులు సేకరణ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పోలవరం నిర్వాసితుల సమస్యలను వివరిస్తూ వారికి అండగా నిలవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ నిధులను సేకరించారు. కార్యక్రమంలో నాయకులు బంకురు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: స్థానిక జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద, తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన 15 రోజులు పాటు మహా పాదయాత్రకు ఖర్చుల నిమిత్తం ఆర్థికంగా ఆదుకొనేలా సోమవారం విరాళాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎ.ఉపేంద్ర, లక్ష్మణ్, శివున్నాయుడు, రైతులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : పోలవరం నిర్వాసితులు చేస్తున్న పోరాటానికి సంఘీభావం తెలియజేస్తూ మండలంలోని ఉల్లిభద్ర జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సంఘీభావ నిధి వసూలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి రమణ, కె.రవీంద్ర, మరడాన పాదినాయుడు, జగన్నాథం నాయుడు, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- సీతంపేట

గిరిజన సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు వినతులు సమర్పించారు. సోమవారం ఐటిడిఎలో స్పందన కార్యక్రమం పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. గొట్టిపల్లి గ్రామానికి చెందిన సంతోష్ సిఆర్‌టి పోస్ట్ ఇప్పించాలని విన్నవించారు. పోల్ల జమ్మల గూడకు రోడ్డు మంజూరు చేయాలని, వెంకట గూడకు చెందిన సవర ముసలమ్మ కిరాణా షాపు లోను మంజూరు చేయాలని, దిగువ మల్లెలు గూడకు చెందిన రేల్లయ్య మేక లోను ఇప్పించాలని, ఈతమాను గూడకు చెందిన బంగారమ్మ అమ్మఒడి డబ్బులు ఇప్పించాలని, సవర గోపాలపురం గ్రామానికి చెందిన సునీత మినీ వాటర్ ట్యాంక్ మంజూరు చేయాలని, కోరారు. పూనుపేటకు చెందిన పున్నమ్మ స్ప్రేయర్ ఇప్పించాలని, కారం గ్రామానికి చెందిన రంభ కుట్టుమిషన్ ఇప్పించాలని వినతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, ఉపవిద్యాశాఖ అధికారి లిల్లీ రాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిడి శ్రీనివాసరావు జిసిసి డిఎం సంధ్యారాణి, ఎటిడిడబ్ల్యూఒ మంగవేణి, సిడిపిఒ రంగ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పిఒ కల్పనా కుమారి

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పార్వతీపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు జులై 10,11 తేదీల్లో తలపెట్టిన ధర్నాను అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రూరల్ కార్యదర్శి శశికళ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఐసిడిఎస్ రూరల్ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీ పిల్లలకు అమ్మఒడి ఇవ్వాలని, యూనిఫాం అందజే యాలని, గర్భిణీలకు ఇస్తున్న రేషన్, ఆయిల్, సరుకుల ధరలు పెంచాలని, ప్రతి నెలా గ్యాస్‌ను ప్రభుత్వమే అందించాలని, ప్రభు త్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, తెలంగాణ కన్నా ఎక్కువ జీతాలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అందివ్వాలని డిమాండ్ చేశారు. సర్వీసులో చనిపోయిన కార్యకర్త కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అంగన్వాడీలను ఇబ్బంది పెట్టే యాప్‌లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు పుష్ప, అప్పయమ్మ, లక్ష్మి, నర్సమ్మ, పార్వతి పాల్గొన్నారు.

పాలకొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కరపత్రాలను సోమవారం ఎం.సింగుపురంలో కార్యకర్తలు ఆవిష్కరించారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు అండ్ హెల్పర్లు యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు అమరవేణి, జెస్సీబాయి, హిమప్రభ తదితరులున్నారు.



సాలూరు: కరపత్రాలను విడుదల చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

జైల్లో ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జైలు శాఖాధికారి కె.మోహన రావు అన్నారు. అర్ధవార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం స్థానిక సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలు ఆవరణమంతా పరిశీలించారు. అలాగే ఖైదీల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రిమాండ్ ఖైదీలకు అందిస్తున్న వసతులు, సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు మెనూ ప్రకారం మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని జైలు సూపరింటెండెంట్ బి.జోగు లుకు సూచించారు. రానున్న వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్, సిబ్బంది హాజరు పుస్తకం తదితర రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జైలు సిబ్బంది హెచ్ సి పి.చంద్రరావు, పి.మధు, నాగరాజు తదితర సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మోహనరావుం

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రావికోన పంచాయితీలో ఆధార్ సెంటర్‌ను కొనసాగించాలని సర్పంచ్ కె.రామస్వామి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఒ జె.వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. దీనికి డిఆర్ఒ స్పందిస్తూ జిల్లా ఆధార్ సెంటర్ నిర్వాహక అధికారులతో మాట్లాడి సచివాలయం పరిధిలో కొనసాగించాలని చెప్పడం జరిగింది. తొలుత రామస్వామి మాట్లాడుతూ సంఘంవలస సచివాలయం పరిధిలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని, అయితే స్థానిక వైసిపి నాయకులు తాము చెప్పకుండా ఇక్కడ ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడమేమిటని వెంటనే ఆధార్ సెంటర్‌ను తొలగించాలని మండల వైసిపి నాయకులతో ఫోన్ చేసి బెదిరింపు గురి చేశారన్నారు. దీంతో నిర్వాకులు ఆధార్ సెంటర్‌ను నిర్వహించలేదన్నారు. దీంతో పిల్లలు, గర్భిణులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో వైస్ సర్పంచ్ హిమరిక లక్ష్మణరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి హిమరిక బలరాం, సిఐటియు నాయకులు జి.సన్యాసిరావు, పార్వతీపురం పట్టణ పౌర సంక్షేమ సంఘ నాయకులు పి .సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వరం అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కాలేజీలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, వాటికి దూరంగా ఉండి భవిష్యత్తును బంగారు బాటలో నడిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, కోఆర్డినేటర్ కల్పన, ఎన్ఎస్ఎస్ పిఒ పెదరామకృష్ణ ఉన్నారు.

పక్కగా రోగ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - సీతానగరం

రోగ నిర్ధారణ పరీక్షలు పక్కగా నిర్వహించాలని జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన మరిపివలసలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు చేపట్టిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షల నివేదికలను పరిశీలించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచి పక్కగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలను గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి క్షేత్ర స్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గర్భిణీలందరికీ ఆరోగ్య తనిఖీలు చేపట్టి, ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన గర్భిణీలకు డిఐఒ స్వయంగా బిపి చూసి ఆరోగ్య పరిశీలన చేశారు. హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.శిరీష, సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది గౌరి, శ్రావణి, చంద్రనాయుడు, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

పక్కాగా 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-వీరఘట్టం

పక్కాగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపిడిఒ జి జయంతి ప్రసాద్ గ్రామ వాలంటీర్లకు సూచించారు. సోమవారం మండలంలోని రేగులపాడు గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రతి గృహాన్ని సందర్శించి పక్కా సర్వే నిర్వహించి వివరాలను గుర్తించి సచివాలయాల్లో జగనన్న యాప్‌లో వివరాలను పొందిపరచాలన్నారు. ఈయనతో పాటు సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

భామిని: ప్రభుత్వ పథకాలు ప్రతీ అర్హత కలిగిన లబ్దిదారులకు చేర్చడంలో వాలంటీర్స్ కీలకం అని జెసిఎస్ కో -ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. సోమవారం బత్తిలి, బాలేరు -1,2 సచివాలయాలు, లివిరి సచివాలయంలో ఎంఎల్ఒ రాంప్రసాద్ ఆధ్వర్యంలో వాలంటీర్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో ప్రతీ ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించాలన్నారు. అర్హత ఉండి రాకపోతే వివరాలు సేకరించి, సచివాలయంలో అందజేయాలనీ, సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి చేర్చడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని రాంప్రసాద్ తెలిపారు. గతంలో పథకాలు రానివారంతా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జామి ప్రభాకర్, బౌరి త్రినాద్, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, మెడిబోయిన చలపతి రావు, ఉషారాణి, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది వున్నారు.

పైలెట్ ప్రాజెక్టును సద్వినియోగం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గొరడలో తాడింగి బంగార్రాజు మా తోట క్షేత్రంలో రెండు రోజులు పాటు రైతులక, రిసోర్స్‌పర్సన్లకు ప్రకృతి వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యం, నవధాన్యాలు విత్తనాలపై శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రెండోవ రోజు శిక్షణ ముగింపు సందర్భంగా జీవ ప్రాజెక్ట్ అధ్యక్షులు తాడంగి జమ్మయ్య మాట్లాడుతూ గొరడలో 8 మంది రైతులు, రాయగడ జమ్మలోని 9, పెంగవలోని 9, వల్లాడలో 14 మంది రైతులు పైలెట్ ప్రాజెక్టు కింద నాబార్డ్ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో పండ్ల తోటలోని అంతర పంటలతో పాటు, పలు పంటలు పండిస్తూ ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచే పంటలు పండించుకోవాలని తద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఘనజీవావమృతం, ద్రవ జీవామృతం తయారీ విధానం ప్రత్యక్షంగా ప్రదర్శనగా చేయించారు. కార్యక్రమంలో జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, కో-డైరెక్టర్ ఎం.నూకం నాయుడు, జీవా కో-ఆర్డినేటర్ జి.ప్రోబొద్, రైతులు కమలకుమారి, లక్ష్మణరావు, సుందరమ్మ, పార్వతి , రమేష్ పాల్గొన్నారు.



నవధాన్యాలను తయారు చేస్తున్న రైతులు

స్థానికులకే టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక నాయకులకే ఎన్నికలో టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వాలని మండల టిడిపి సీనియర్ నాయకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో టిడిపి సీనియర్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం మాట్లాడుతూ సీతంపేట స్థానిక వ్యక్తికే 2024 ఎన్నికల్లో టిక్కెట్టు ఇవ్వాలని తీర్మానం చేశామన్నారు. పాలకొండ నియోజకవర్గం, సీతంపేట మండలంలో ఉన్న అత్యధిక గిరిజన జనాభా జాతపు, సవర ఆధారంగా యస్‌టికి కేటాయించడం జరిగిందని అందుకే టిడిపి అధిష్టానం సీతంపేట స్థానిక అభ్యర్థికి టికెట్ ప్రకటిస్తే గెలిపించుకుంటామని చెప్పారు. మాజీ ఎంపిపి సవర మాలయ్య మాట్లాడుతూ టిడిపి గెలవడమంటూ జరిగాలంటే సీతంపేట స్థానిక అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలన్నారు. 40 సంత్సరాలుగా సీతంపేట మండలం వారికి అవకాశం రాలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి ఆరిక లక్షుమ్మయ్య, మాజీ జెడ్‌పిటిసి పాలక రాజబాబు, నాయకులు బిడ్డిక దమయంతి నాయుడు, బిడ్డిక కుర్మరావు, సవర కూర్మా రావు, సవర బిగ్ బాస్, సంతు, కె. రామారావు, సవర సూర్యం తదితరులు పాల్గొన్నారు.

మొదలైన విస్తరణ పనులు

వీరఘట్టం: మండల కేంద్రంలోని సోమవారం ప్రధాన రహదారి విస్తీర్ణ పనులు మొదలయ్యాయి. వట్టిగడ్డ వంతెన నుండి స్వామి థియేటర్ వరకు 1.2 కిలోమీటర్ల దూరంలో ఉపాధి హామీ పథకం రూ 5.5 కోట్లతో రహదారి విస్తీర్ణం పనులు చేపట్టవలసి ఉంది. ప్రస్తుతం జెసిబి ద్వారా 40 ఎంఎం రాళ్లను చదును చేస్తున్నారు. వీలైనంత త్వరగా రహదారి అభివృద్ధి విస్తరణ పనులు వేగవంతం చేసేందుకు ముమ్మర చర్యలు తీసుకుంటున్నట్లు కాంట్రాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.



రోడ్డు విస్తరణ చేస్తున్న పొక్లెయినర్

'డంపింగ్ యార్డ్ పనులు చేపట్టొద్దు'

పాలకొండ: పారాపురం దగ్గర డంపింగ్ యార్డ్ పనులు చేపట్టొద్దని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడుతో పాటు గ్రామస్తులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒ సావిత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సమస్యను వివరించారు. కోర్టులో ఈ సమస్యపై పిటిషన్ వేసినప్పటికీ దానిపైన నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నారని ఆరోపించారు. కోర్టు నుంచి నెంబర్ కూడా కేటాయించారని, అయినప్పటికీ అధికారులు ఈ విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే ఈ పనులు ఆపాలని హెచ్చరించారు

మహాదేవి వలసలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం: మండలంలోని చలివేంద్ర పంచాయతీ పరిధి మహ దేవివలస గ్రామంలో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ వివిధ రకాల రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలు కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తే వ్యాధులు దరి చేరవని తరచుగా వేడి నీరు తాగాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓ శాంతకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా నిర్లక్ష్యం..

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ పంచాయతీ మల్లుగూడ సమీపంలో గెడ్డపై నిర్మించిన కల్వర్టు నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. నేటి వరకు ఈ కల్వర్టు నిర్మాణంపై అధికారులు శ్రద్ధ వహించకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో పొలం పనులు, బయట ప్రాంతాలకు వెళ్లేవారు గెడ్డవాగు ప్రవాహానికి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే ఇక్కడి ప్రజల కష్టాలు వర్ణాతీతం. కల్వర్టు నిర్మించాలని మూడేళ్ల కిందట సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన చేపట్టగా నేటికీ స్పందించలేదు. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఇక్కడే కల్వర్టు నిర్మించాల్సి ఉంది

స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వర్కర్లుగా గుర్తించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమను స్కిల్డ్, సెమీసిల్డ్ వర్కర్లుగా తమను గుర్తించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది మున్సిపల్ కమిషనర్ జె రామ అప్పల నాయుడును కోరారు. ఈ మేరకు సోమవారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌తో మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పదేళ్ల నుంచి పనిచేస్తున్నామన్నారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్‌గా అప్పటి కమిషనర్ తమలో కొంత మందిని చేర్చుకున్నారన్నారు. తమ నైపుణ్యాన్ని అనుసరించి వేతనం ఇచ్చేవారన్నారు. కానీ 2016లో సమాన పనికి సమాన జీతం అనే ప్రతిపాదన తీసుకు వచ్చి అందరికీ ఒకే జీతం అనుసరించి ఇస్తున్నారన్నారు. అలాగే అవుట్సోర్సింగ్‌లో తమను నాన్ పిహెచ్‌సి వర్కర్లుగా అప్లోడ్ చేశారని, అందువల్ల తమకు (స్కిల్డ్, సెమీ స్కిల్డ్) వర్కర్లయినా తాము తమ జీతంలో కొంత మొత్తాన్ని నష్టపోతున్నామని అన్నారు. కావున ఇప్పటికైనా తమను స్కిల్డ్, సెమి స్కిల్డ్‌గా గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఇంజనీరింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రమిస్తున్న సిబ్బంది